# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మరో 17,676 మందికి..

## నేడు 7 ప్రాంతాల్లో లబ్ధిదారులకు అందజేయనున్న మంత్రులు



**ఎవరెవరు ఎక్కడ పంపిణీ చేస్తారంటే**

| నియోజకవర్గం/ ప్రాంతం | లబ్ధిదారులు | పంపిణీ చేసే ప్రజాప్రతినిధి |
|---|---|---|
| కుత్బుల్లాపూర్/దుండిగల్ | 2550 | మహమూద్ అలీ |
| పటాన్‌చెరు/ కొల్లూరు-2 | 7241 | హరీశ్‌రావు |
| మేడ్చల్/మురహరిపల్లి | 2376 | మల్లారెడ్డి |
| మేడ్చల్/తూంకుంట | 1548 | డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి |
| మేడ్చల్/ రాంపల్లి | 2845 | పద్మారావు గౌడ్ |
| ఉప్పల్/చైతన్యనగర్ | 396 | సబితా ఇంద్రారెడ్డి |
| మేడ్చల్/కొర్రెముల | 720 | తలసాని శ్రీనివాస్ యాదవ్ |

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 3వ విడతలో ఎంపికైన లబ్ధిదారులకు గురువారం (నేడు) ప్రజాప్రతినిధులు ఇండ్లను పంపిణీ చేయనున్నారు. పేద ప్రజలు ఎంతో గొప్పగా బతకాలి, సొంత ఇంటి కలను నెరవేర్చాలనే సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకు రూ. 9,600 కోట్ల వ్యయంతో జీహెచ్ఎంసీ పరిధిలో ఎంతో విలువైన స్థలాల్లో ప్రభుత్వం లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. నిర్మించిన ఇండ్లను ఎంతో పారదర్శకంగా, రాజకీయ ప్రమేయం లేకుండా, పార్టీలకు అతీతంగా ఆన్‌లైన్‌లో డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మొదటి విడతలో 11,700 మందికి, రెండో విడతలో 13,200 మందికి , మూడో విడతగా ఈ నెల 2న 19,020 మంది లబ్ధిదారులకు ఇండ్లను పంపిణీ చేశారు. మూడో విడత లక్కీడ్రాలో మిగిలిన 17,676 ఇండ్లను ఏడు ప్రాంతాల్లోని లబ్ధిదారులకు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## ఇడ్లీ, ఉప్మా, పొంగల్

### రేపటి నుంచే బడుల్లో బ్రేక్‌ఫాస్ట్: జిల్లా కలెక్టర్



సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ విద్యార్థులకు ఈ నెల 6న అల్పాహారం అందించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఈవో రోహిణి, సంబంధిత అధికారులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 15 నియోజకవర్గాలలో ప్రతి నియోజక వర్గం నుంచి ఒక పాఠశాలను ఎంపిక చేసి అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ పథకాన్ని మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రారంభింపజేయాలన్నారు. ఇది చాలా మంచి పథకమని, విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాలలకు రావడానికి ఇష్టపడతారన్నారు. పిల్లలు మధ్యలోనే బడి మానివేయడం కూడా తగ్గుతుందన్నారు. దీని ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం కూడా పెరగడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అల్పాహారం అందించడంలో భాగంగా శుభ్రమైన, పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అల్పాహారంలో ఇడ్లీ సాంబారు, కిచిడి, ఉప్మా, పొంగల్, పులిహోర వంటి పదార్థాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో మన్నన్ ట్రస్టీ డైరెక్టర్ లీనా జోసఫ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

- జిల్లాలో మొత్తం 15 నియోజకవర్గాల్లోని పదిహేను ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార ప్రారంభ కార్యక్రమం షురూ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు.

## నిరుపేదలకు ఉపాధి కల్పించేందుకు సీఎం కృషి

### హోంమంత్రి మహమూద్ అలీ



డ్రైవర్ కం ఓనర్ పథకం కింద అర్హులకు మంజూరైన కార్లను పంపిణీ చేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, అక్టోబర్ 4: తెలంగాణలో నిరుపేదలకు ఉపాధి కల్పించేందుకు సీఎం కేసీఆర్ అనేక చర్యలు తీసుకుంటున్నట్లు హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తాలో డ్రైవర్ కం ఓనర్ పథకం కింద మంజూరైన కార్లను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక మంది నిరుపేదలకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రహ్మద్ బేగ్, మైనార్టీ వెల్ఫేర్ విభాగం చైర్మన్ ఇంతియాజ్, కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లుండి.. మెట్లబావి వద్ద దాన్ ఉత్సవ్

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం సోషల్ ఇంపాక్ట్ గ్రూపు (టీ-ఎస్ఐజీ), సోషల్ వెంచర్ పార్టనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7న బన్సీలాల్‌పేట మెట్ల బావి వద్ద దాన్ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీ- ఎస్ఐజీ డైరెక్టర్ అర్చనా సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సోషల్ వెంచర్ పార్టనర్స్‌తో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. 7న నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

## నేటి నుంచి ఉచిత రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

బంజారాహిల్స్, అక్టోబర్ 4: ప్రపంచ రొమ్ము క్యాన్సర్ మాసం సందర్భంగా అక్టోబర్ 5 నుంచి 20 వరకు బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆస్పత్రి ఆవరణలోని యాడ్‌లైఫ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నామని ఆస్పత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. మరిన్ని వివరాలకు 040-23551235 (ఎక్స్‌టెన్షన్ 2354) నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ నిర్ణయంపై అర్చక ఉద్యోగ జేఏసీ హర్షం



ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న అర్చక, ఉద్యోగ జేఏసీ సభ్యులు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 4: తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని మరో 350 దేవాలయాలకు ధూప, దీప, నైవేద్యం పథకాన్ని వర్తింపజేయడం పట్ల అర్చక ఉద్యోగ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో జరిగిన జేఏసీ సమావేశంలో చైర్మన్ గంగుల ఉపేంద్రశర్మ, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొండూరి కృష్ణమాచారి, సభ్యులు మఠం శివకుమార్, అధ్యక్షులు భద్రినాథాచార్యులు, కన్వీనర్ పరశురాం రవీంద్రాచారి, చంద్రశేఖర శర్మ పాల్గొని సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అర్చకులకు డీడీఎన్ పథకం వర్తింపజేయడం హర్షించదగిన విషయమన్నారు.

## ఎస్టీపీ పనులను పరిశీలించిన ఎండీ దానకిశోర్



సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): జలమండలి ఎండీ దానకిశోర్ బుధవారం పలు ప్రాంతాల్లో పర్యటించి.. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రాలను పరిశీలించారు. ఫతేనగర్, ఖాజాకుంట ఎస్టీపీలను ఎండీ పరిశీలించి.. చివరి దశలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈడీ డాక్టర్ ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఎస్టీపీ సీజీఎంలు రఘు, పద్మజ, జీఎం, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అనురాగ్‌లో డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ క్లబ్



అనురాగ్ యూనివర్సిటీలో డిజిటల్ మ్యాన్ ఫ్యాక్చరింగ్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న వినాయక్ భండార్కర్ తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 4: విద్యార్థులకు డిజిటలైజేషన్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అడ్రాయిటెక్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్ జనరల్ మేనేజర్ వినాయక్ భండార్కర్ తెలిపారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ క్లబ్‌ను బుధవారం ప్రారంభించారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు డిజిటల్ పరివర్తన ప్రయాణాన్ని ప్రారంభించాలని చెప్పారు. యూనివర్సిటీలో ప్రారంభించిన టెక్నికల్ క్లబ్ యొక్క ప్రధాన లక్ష్యం విద్యార్థులకు వినూత్న జ్ఞానాన్ని అందించడమేనని చెప్పారు. డిజిటల్ తయారీ రంగంలో జాతీయ స్థాయి సాంకేతిక వర్క్‌షాపులు, సెమినార్లు, గెస్ట్ లెక్చర్లను నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ విజయకుమార్, హెచ్‌వోడీ శ్రీనివాస్, సీఆర్‌డీఎం కో ఆర్డినేటర్ మదన్‌మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నాచారం వేదికగా జరిగిన రెండో రాష్ట్ర మినీ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో రజత పతకం సాధించిన యువ షట్లర్ మనిస్విని బుధవారం అభినందిస్తున్న డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఎస్‌హెచ్‌వో దయాకర్‌రావు, రవి..

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
మల్కాజ్‌గిరి సర్కిల్-28
GHMC
NIT No. 30/EE-28/SBZ/GHMC/2023-24
పని పేరు: నిర్వహణ పనులు ఇతరములు-10. అంచనామొత్తం (రూ. లక్షలలో): 171.20. బిడ్ దాఖలు ప్రారంభ తేది & సమయం/బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 04-10-2023న సా|| 04.00 గం./11-10-2023న సా|| 04.00 గం. అధికారి పేరు & చిరునామా, సెల్ నెం: ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సెల్ నెం: 9154796465. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్: http://www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డివిజన్ నెం. 28, GHMC.
DIPR RO.No. 7722-PP/CL/ADVT/1/2023-24, Dt: 04-10-2023

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజినీర్-M, L.B. నగర్ జోన్
GHMC
NIT No. 26/SEM/LBNZ/GHMC/J2&J3/2023-24, సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 03-10-2023
పని పేరు: L.B.నగర్ జోన్, GHMCలో 26 CC రోడ్ పనులు, 1 భవనం పని & 1 స్మశాన వాటిక పని. మొత్తం పనులు: 28 పనులు. మొత్తం లక్షలలో: రూ. 2144.89 లక్షలు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేదీ/చివరి తేదీ & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 04-10-2023న మ|| 3.00 గం. బిడ్ దాఖలుకు ముగింపు తేది: 11-10-2023న మ|| 3.00 గం., సాంకేతిక బిడ్ తెరచు తేది: 11-10-2023న మ|| 3.30 గం., ధర బిడ్ తెరుచు తేది: 11-10-2023న మ|| 3.40 గం. అధికారి పేరు & చిరునామా, ఫోన్ నెం: SE-M, LBNZ, GHMC జోనల్ కార్యాలయం, గడ్డి అన్నారం, హైదరాబాద్. ashokreddy.v@gov.in, 9701362708. తదుపరి వివరాలను https://tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్-M, L.B. నగర్ జోన్, GHMC.
DIPR RO.No. 7705-PP/CL/ADVT/1/2023-24, Dt: 04-10-2023